సోములవారిపల్లె ఈద్గాను ముస్లింలకు అప్పగిస్తా

ప్రొద్దుటూరు : మండలంలోని సోములవారిపల్లె గ్రామం వద్ద తన సొంత డబ్బుతో నిర్మించిన ఈద్గాను త్వరలో ముస్లింలకు అప్పగిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ముస్లిం మైనారిటీ నాయకులతో కలసి ఆదివారం ఆయన ఈద్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను స్థలం కొనుగోలు చేసి ఈద్గాను నిర్మించానని తెలిపారు. ఇప్పటి వరకు దీనిని ఎవరూ వినియోగించలేదన్నారు. ప్రస్తుతం సోములవారిపల్లె గ్రామం వద్ద వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మిస్తున్నారని, పెన్నానగర్, ఈశ్వర రెడ్డినగర్ వాసులకు ఈద్గా దగ్గర అవుతుందన్నారు. త్వరలో జరగనున్న బక్రీద్‌పండుగ సందర్భంగా ముస్లింలు ఇక్కడ ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేయిస్తానని తెలిపారు. 23వ వార్డు కౌన్సిలర్ వడ్ల ఇబ్రహీం ఖలీల్, వార్డు ఇన్‌చార్జి వడ్ల దాదా పీర్, 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, 25వ వార్డు ఇన్‌చార్జి షేక్ నూరి తదితరులు పాల్గొన్నారు.


ఈద్గాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి

రోడ్డు నిర్మాణం.. ఎమ్మెల్యేకు సన్మానం

ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని రాజుపాళెం మండలం వాసుదేవపురం గ్రామం నుంచి మురళీనగర్ మెట్ట వరకు కొత్తగా రూ.54 లక్షలతో రోడ్డు నిర్మించారు. 30 ఏళ్లుగా ఇక్కడ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను ప్రజలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.54 లక్షలు నిధులు మంజూరు చేయించి నూతనంగా రోడ్డు వేయించారు.

దీంతో గ్రామస్తులు ఈగలపాటి శివ, బండి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డిని కలిసి శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు.


వాసుదేవపురం గ్రామం నుంచి మురళీనగర్ మెట్ట వరకు నిర్మించిన తారు రోడ్డు

భగవద్గీత ద్వారా ఎంతో జ్ఞానం

అట్లూరు : భగవద్గీత ద్వారా ఎంతో జ్ఞానం లభిస్తుందని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి– ఇందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు జి.ప్రసాద్, సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మాడపూరు, కుమ్మరివారిపల్లి, కాటంవారిపల్లి, పార్వతీపురం, దిన్నెమీదపల్లి, మణ్యంవారిపల్లి, వలసపాళెం గ్రామాలలో ఆదివారం త్రైతసిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం పూర్వం ప్రపంచ దేశాలన్నింటికీ జ్ఞానాన్ని అందించి విశ్వగురువుగా ఉందన్నారు. కావున భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికీ త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పెంచలరత్నం, నరసింహులు, మహేంద్రా, మధు, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాడపూరులో భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి నాయకులు

సమాజ శ్రేయస్సే జేవీవీ లక్ష్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : సమాజ శ్రేయస్సే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక పనిచేస్తోందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర రాహుల్ అన్నారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ఆదివారం శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవుడు సాధించిన ప్రగతి, పర్యావరణ అసమతుల్యత – పర్యవసనాలు – పరిష్కారాలు, జీరో షాడో డే అనే అంశంపై రాయలసీమలోని అన్ని జిల్లాల యూత్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మానవుడు శారీరక, మానసిక, ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉండాలంటే సైన్స్‌పై ఆధారపడి జీవించాలన్నారు. భారతదేశంలో రోజు రోజుకు ప్రజల్లో అంతరాలు పెరిగిపోతున్నాయని, దీనికి కారణం కార్పొరేటీకరణకు ప్రభుత్వాలు దాసోహం అవడమే అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్, రాష్ట్ర నాయకుడు జిలానీ బాషా, వెంకటేష్ మాట్లాడుతూ పాఠ్యాంశాలలో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్, ప్రజాస్వామ్యం, శక్తివనరులు తదితర అనేక అంశాలను తొలగించడం వల్ల విద్యార్థులు శాస్త్రాన్ని తెలుసుకోవడం కష్టం అవుతోందన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులను రాజకీయ, ఆర్థిక కోణంలో యువత పరిశీలించాలని, ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత వారిదే అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు బాలబయన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, జిల్లా నాయకులు ఉషారాణి, సుజన్, ఎస్తేర్, సుబ్బయ్య డాక్టర్ చక్రధర్, శ్రీరాములు, మురళీ గుప్త, జ్యోతి ప్రకాష్, సహజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజశేఖర రాహుల్

చెరువా.. డంపింగ్ యార్డా?

బద్వేలు అర్బన్ : పట్టణంలోని కొంత మంది వ్యాపారుల నిర్లక్ష్యం వల్ల పోరుమామిళ్ల బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాగుల చెరువు డంపింగ్‌యార్డును తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలు, జంతు కళేబరాలతో నిండిపోయి కంపు కొడుతోంది.

అలాగే చెరువులోని నీటిలో సైతం పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరాయి. దీంతో బైపాస్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళలో వాకింగ్‌కు వెళ్లే పాదచారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యర్థాలు వేస్తుండటంతో చెరువు కలుషితమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నాగులచెరువులో భారీగా చెత్త వ్యర్థాలు చేరిన దృశ్యం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం దరకాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తెలుగుగంగా కాలనీలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని, జూలై 3న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 4వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం అన్ని డిగ్రీ కళాశాల్లో మేజర్, మైనర్ సబ్జెక్టుల విధానాన్ని అమలు చేస్తోందని ప్రిన్సిపాల్ తెలిపారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ బీజెడ్సీ, బీఏ, బీకాం కంప్యూటర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అవకాశాన్ని ఇంటర్మీడియట్ పాస్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ చార్జీల భారాలు ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీల భారాలు ఉపసంహరించుకోవడంతోపాటు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు ఆపాలని, స్మార్ట్ మీటర్ల పేరుతో లక్షల కోట్లు ప్రజలపై భారాలు వేసే విద్యుత్ సంస్కరణల బిల్లును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం పాత బస్టాండ్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి అధ్యక్షతన విద్యుత్తు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ గాలి, నీరు తర్వాత విద్యుత్తు ప్రజల నిత్యవసర వస్తువుగా మారిందన్నారు. 2022 ఒక్క సంవత్సరంలోనే రూ.14 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలు నుంచి వసూలు చేశారన్నారు. దేశంలోని సుమారు రూ.18 లక్షలకు పైగా ఉన్న వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తూ వ్యవసాయదారులపై కూడా విద్యుత్తు బిల్లుల చార్జీలు వేస్తున్నారని విమర్శించారు. సిపిఎం నగర కార్యదర్శి రామ మోహన్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోకసత్తా నాయకులు దేవర కృష్ణ ఎస్.ఫరూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

రేపు మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు

వేంపల్లె : మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు మంగళవారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బండి వీరారెడ్డి పేర్కొన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనదలచినవారు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. నాల్గవ తరగతి విద్యార్థులు 2014 ఆగస్టు నుంచి 2015 జూలై మధ్య జన్మించి ఉండాలన్నారు. ఐదవ తరగతి విద్యార్థులు 2013 ఆగస్టు నుంచి 2014 జూలై మధ్య జన్మించి ఉండాలన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట స్టడీ సర్టిఫికెట్, 3 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలన్నారు. ఎత్తు, బరువు, స్టాండింగ్, పరుగు పందెం తదితర అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కడప కార్పొరేషన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డ్రైవర్ల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులను ఫ్రంట్ లైన్ వారియెర్స్ అని ప్రకటించి, జీతాల విషయంలో తాత్సారం చేస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోతే నిరవధిక పోరాటాలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్ల కమిటీ అధ్యక్షుడు వి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో మున్సిపల్ కార్మికులపై పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. కార్మిక నాయకులు కె. శ్రీరామ్, కిరణ్‌కుమార్, బాలాజీ, శ్రీను, ఆషిబాబు, శ్రీను, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్ : కడప నగరం తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో ప్రారంభమైన ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రెనింగ్ క్యాంపు–2 ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 505 మంది ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ పొందుతున్నారు. కడప 30వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపును కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, దేశభక్తి ధ్యేయంగా ఎన్‌సీసీ శిక్షణ కొనసాగుతుందన్నారు. భారతసైన్యంలో చేరదలుచుకునే యువతకు ఎన్‌సీసీ ఒక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధ శిక్షణ, యోగ, మ్యాప్‌రీడింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా తల్‌సైనిక్ క్యాంపు, రిపబ్లిక్‌డే పరేడ్‌కు వెళ్లే ఎన్‌సీసీ కేడెట్స్‌కు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలభైరవునికి పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని కాలభైరవపురంలోగల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరువ బాలాజీరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకే మూలమూర్తికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం నిర్వహించారు.

రేపు చలో విజయవాడ

కడప వైఎస్ఆర్ సర్కిల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు.

క్లుప్తంగా

నేడు గడపగడపకూ మన ప్రభుత్వం

అట్లూరు : మండల పరిధి కొండూరు పంచాయతీలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా పాల్గొని, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల మూడో ఆదివారం పేదలకు ఉచితంగా కంటి, గుండెజబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి 40 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు చేయగా, 21 మందికి ఉచితంగా ఈసీజీ, 6 మందికి గుండె స్కానింగ్ పరీక్షలు చేసి చికిత్స అందించి సూచనలు చేశారు. డాక్టర్ హరిత 28 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి చికిత్స అందించారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే సీమ పేరు!


ప్రొద్దుటూరు : రాజకీయ ప్రయోజనాల కోసం కొంత మంది రాయలసీమ పేరును వాడుకుంటున్నారని రాయలసీమ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలుగు గంగా ప్రాజెక్టులు రాజకీయాలకు అతీతంగా సాధించిన ప్రాజెక్టులని ఆయన పేర్కొన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల కోసం రాయలసీమ విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలతో త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ పేరుతో టీడీపీకి కొందరు మద్దతు ఇస్తున్నారని, స్వచ్ఛమైన రాయలసీమ ఉద్యమకారులు మద్దతు ఇవ్వరని స్పష్టం చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అక్షిత్‌కుమార్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రోటరీక్లబ్ కార్యాలయంలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కీళ్లనొప్పుల వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.అక్షిత్ కుమార్ 180 మంది రోగులను పరీక్షించి వారికి తగిన సూచనలు, సలహాలతో పాటు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, సెక్రటరీ బాలసూర్యారావు, రోటరీ ట్రస్ట్ హాస్పిటల్ ప్రెసిడెంట్ శివకుమార్, రాంప్రసాద్ రెడ్డి, బాబా సాహెబ్, సూర్యనారాయణరెడ్డి, మహబూబ్‌బాషా, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈలో ర్యాంకు


హరిదీరజ్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు నరసింహారెడ్డి, రాజేశ్వరి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు అట్లా నరసింహారెడ్డి, రాజేశ్వరిల కుమారుడు హరిదీరజ్ రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 పరీక్ష ఫలితాల్లో 1708వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ ఎంసెట్‌లో 189వ ర్యాంకును, ఏపీ ఎంసెట్‌లో 407వ ర్యాంకును, జేఈఈ మెయిన్స్‌లో 2061వ ర్యాంకును విద్యార్థి సాధించాడు. విద్యార్థి తండ్రి స్థానిక ఎస్‌వీపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, తల్లి రాజేశ్వరి వెల్లాల గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థి హరిదీరజ్‌రెడ్డి ర్యాంకు సాధించడంపై గౌతమ్ హైస్కూల్ కరస్పాండెంట్ సుధీర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చెన్నకేశవరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మండలంలోని తువ్వపల్లె వద్ద ఆదివారం సాయంత్రం చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. దువ్వూరు మండలం నాగాయ పల్లెకు చెందిన చెన్నకేశవరెడ్డి కి మైదుకూరు మండలం శ్రీరామ్ నగర్ కు చెందిన ఓ వ్యక్తి కి మధ్య పొలం కౌలు విషయమై వివాదం ఏర్పడినట్టు తెలుస్తోంది. ఆదివారం మైదుకూరు మండలం తువపల్లె వద్ద వారిరువురి మధ్య వాగ్వాదం జరిగినట్టు సమాచారం.అక్కడే చెన్నకేశవరెడ్డి పురుగుల మందు సేవించగా సమాచారం అందుకున్న మైదుకూరు 108 వాహనం సిబ్బంది బాధితున్ని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల వివరాలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొండపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కుల, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్నామని వివరించారు. గ్రామ సచివాలయాలతో ఇళ్ల వద్దకే పాలనను అందిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని చెప్పారు. నవరత్నాలతో ప్రతి ఇల్లు అభివృద్ధి సాధించేలా చూస్తున్నామన్నారు. విద్యావ్యవస్థలో అమ్మ ఒడి, విద్యాకానుక, గోరుముద్ద పథకాలతో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని కోరారు. కొండపేటలో విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, పొలాలకు వెళ్లే దారి సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా పరిష్కారించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూధా రామక్రిష్ణారెడ్డి, నారాయణ యాదవ్, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలని మున్సిపల్ డీఈ గంజికుంట రమణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తినిపుణుల కార్యాలయంలో ఆదివారం తొగటవీర విద్యార్థులకు ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. చదువుకుంటే ఏదైనా సాధించగలమని విద్య ప్రాముఖ్యతను వివరించారు. తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతిభ గల తొగట విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో ప్రతిభా పురస్కాలను అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలను అందించారు. అలాగే కన్సోలేషన్ బహుమతిగా 18 మంది విద్యార్థులకు రూ.1000 విలువ చేసే ఎలక్ట్రానిక్ క్యాలికులేటర్లను అందించారు. సంఘం వైస్ ప్రెసిడెంట్ శివనాగయ్య, సెక్రటరీ రాధాకృష్ణమూర్తి, కోశాధికారి రబ్బా నరసయ్య, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి కొత్తపల్లె పంచాయతీ టీచర్స్ కాలనీలో ఆదివారం కాలువ నిర్మాణానికి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ జనరల్ ఫండ్ రూ.16లక్షల నిధులతో కాలువల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేశామన్నారు. అమృతానగర్‌లో రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం, ఎన్జీఓ కాలనీ, రాజరాజేశ్వరి కాలనీ, వివేకానంద కాలనీలలో రోడ్లు, మురికినీటి కాలువలు, మోరీల నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు సూర్యనారాయణ, మణి, ఆ ప్రాంత ప్రజలు జగన్, పప్పుల బట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రథమ స్థానం విద్యార్థినికి ప్రోత్సాహకం

కాశినాయన : జిల్లాలో ఇంటర్ బైపీసీలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం అందజేశారు. మండలంలోని నరసాపురానికి చెందిన ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన సానా చైతన్యలక్ష్మి ఇంటర్మీడియెట్ బైపీసీలో 1000కి 947 మార్కులు సాధించింది. ఈ విద్యార్థిని జిల్లా స్థాయిలో బైపీసీలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకు గాను ఈ విద్యార్థినికి ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పథకం కింద రూ.50 వేలు అందజేసింది. ఇందుకు సంబంధించిన చెక్కు, ప్రశంసా పత్రాన్ని శనివారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయరామరాజు అందజేశారు. ఆ పాఠశాల ప్రిన్సిపల్ సాజన్యను శాలువాతో సత్కరించారు.


కలెక్టర్ చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న చైతన్యలక్ష్మి

గంగమ్మా.. కాపాడమ్మా

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దులో గల గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి అభిషేకాలు నిర్వహించారు. శాంతించమ్మా... గంగమ్మా అంటూ రైతులు వేడుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలు, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబలులు ఇచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


చింతకొమ్మదిన్నె : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోర్కెలు తీర్చే తల్లిగా ప్రసిద్ధి గాంచారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కోర్కెలు తీరిన భక్తులు జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

చల్లంగా చూడు తల్లీ

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని తలపనూరు పంట పొలాల్లో వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం చల్లంగా చూడు తల్లీ అంటూ పూజలు చేశారు. అమ్మవారిని ఆలయ అర్చకులు రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్: కడప నగరం తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో ప్రారంభమైన ఎన్‌సీసీ కంబైన్డ్ అన్యువల్ ట్రెనింగ్ క్యాంపు–2 ఉత్సాహంగా సాగుతోంది. క్యాంపులో కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 505 మంది ఎన్‌సీసీ కేడెట్స్ శిక్షణ పొందుతున్నారు. కడప 30వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంపును కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాపా ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, దేశభక్తి ధ్యేయంగా ఎన్‌సీసీ శిక్షణ కొనసాగుతుందన్నారు. భారతసైన్యంలో చేరదలుచుకునే యువతకు ఎన్‌సీసీ ఒక చక్కటి వేదిక అని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్లు, ఆయుధ శిక్షణ, యోగ, మ్యాప్‌రీడింగ్ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా తల్‌సైనిక్ క్యాంపు, రిపబ్లిక్‌డే పరేడ్‌కు వెళ్లే ఎన్‌సీసీ కేడెట్స్‌కు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సుబేదార్ మేజర్ అశోక్‌కుమార్, సుబేదార్ బిష్ణోయ్, ఎన్‌సీసీ అధికారి జయచంద్ర, కార్యాలయ సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, జయసుధ, ప్రియదర్శిని, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తున్న అధికారి